క్లుప్తంగా

వైభవంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: దుప్పాడ గంగానగర్‌లోని శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో శ్రీనివాస కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో శ్రీనివాసునికి ప్రత్యేక పూజలతో పాటు కన్నులపండువుగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మహా చండీహోమం



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం పంచాయతీ దేవుని నెలివాడ గ్రామంలో వేంచేసిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం మహాచండీ హోమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త లెంక రామాయమ్మ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆలయ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇంతటి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేకువజామున 5 గంటలకు అమ్మవారికి అభిషేకం, అలంకార సేవ, సహస్రనామార్చనలు నిర్వహించిన తర్వాత ఉదయం 8 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో మహా చండీ హోమం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. భక్తులందరూ పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


ప్రశాంతంగా గ్రూప్ -2 పరీక్షలు



గ్రూప్ - 2 పరీక్ష కేంద్రం వద్ద తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

పూసపాటిరేగ: మండల కేంద్రంలో గ్రూప్ -2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఓక్‌ల్యాండ్ పాఠశాల, జెడ్పీహెచ్ స్కూల్, ఆర్టర్ పాఠశాలలో పరీక్షలు జరిగాయి. జెడ్పీ పాఠశాలలో 220 మంది అభ్యర్థులకు గాను 158 మంది.. ఓక్‌ల్యాండ్ పాఠశాలలో 400 మందికి 310 మంది.. ఆర్టర్ పాఠశాలలో 372 మందికి 285 మంది అభ్యర్థులు హాజరయ్యారు. తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి పర్యవేక్షించారు. చీఫ్ సూపరింటిండెంట్‌లుగా బి. శంకరరావు, సీహెచ్ రవి, శ్యామలరావు వ్యవహరించారు.

అటవీశాఖ కార్యాలయానికి కలప తరలింపు



ఎంబేరేయగుళ్లు వద్ద కలపతో ఉన్న వాహనం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి, ఎంబేరేయగుళ్ల సమీపంలో ఉన్న ఫారెస్ట్ కొండపై వృథాగా ఉన్న ఎర్ర చందనం కలపను జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి ఆదివారం తరలించారు. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో కొండపై నేలకొరిగిన ఎర్ర చందనం కలపను ఫారెస్ట్ బీట్ అధికారి రామారావు ఆధ్వర్యంలో సేకరించారు.

ఓక్‌ల్యాండ్ విద్యార్థుల ప్రతిభ



బహుమతి సాధించిన విద్యార్థితో ప్రిన్సిపాల్ రవి

పూసపాటిరేగ: జిల్లా కేంద్రంలోని ఫోర్ట్‌సిటీ స్కూల్‌లో ఆదివారం జరిగిన వేదిక మ్యాథ్స్, అబాకస్ పోటీల్లో స్థానిక ఓక్‌ల్యాండ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి విద్యార్థి ఎస్. దీపిక వేదిక మ్యాథ్స్‌లో జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. మూడో తరగతికి చెందిన టి. హర్షవర్ధన్ అబాకస్‌లో జిల్లాస్థాయిలో మొదటి స్థానం నిలిచాడు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యాలయాల్లో కార్పొరేట్ హంగులు..

- 'మనబడి నాడు – నేడు'తో మారిన పాఠశాలల రూపురేఖలు
- తొలి విడతలో మండలంలోని 18 పాఠశాలల అభివృద్ధికి రూ. 4.39 కోట్లు మంజూరు
- రెండో విడతలో 11 పాఠశాలల అభివృద్ధికి రూ. 1.61 కోట్లు..



జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాల

విజయనగరం రూరల్: ప్రాథమిక స్థాయి నుంచే అత్యున్నత విద్యా ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నారు. ముందుగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి, పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేలా ఆసక్తి కనబరచడానికి నాలుగేళ్ల కిందట 'మనబడి నాడు – నేడు' కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ కార్యక్రమం కింద కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయడంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా పూర్తిగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించడంతో కార్పొరేట్ స్థాయి పాఠశాలలుగా అభివృద్ధి చెందాయి. విజయనగరం మండల పరిధిలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 32 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 2019కి ముందు ఆయా పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆయా గ్రామాల నుంచి అనేక మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల బాటపట్టారు. మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థినుల అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన నాడు – నేడు కార్యక్రమంలో విజయనగరం మండలంలో తొలివిడతలో 18 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో 4 జిల్లా పరిషత్ పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 8 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో భవన నిర్మాణాలు, విద్యుత్, రన్నింగ్ వాటర్ సదుపాయం, ప్రహరీల నిర్మాణం, తాగునీరు, ఫ్యాన్లు, డిజిటల్ బోర్డులు, మరుగుదొడ్లు, ఇతరత్రా పనులకు రూ.4.39 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో ఆయా పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు తలదన్నే రీతిలో రూపుదిద్దుకున్నాయి. అలాగే రెండో విడతలో మరో 11 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ. 1.61 కోట్లను మంజూరు చేశారు.



చెల్లూరు ప్రాథమికోన్నత పాఠశాల



నాడు- నేడు నిధులతో నిర్మించిన గుంకలాం ప్రాథమిక పాఠశాల భవనం



సారిక పాఠశాలలో అత్యాధునికంగా నిర్మించిన మరుగుదొడ్లు



మలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం



రాకోడు ప్రాథమిక పాఠశాలలో లోపలి భాగం



నాడు: సారిక పాఠశాల భవనం దుస్థితి



నేడు : ఆకర్షణీయంగా సారిక ప్రాథమికోన్నత పాఠశాల



రాకోడు పాఠశాలలో డిజిటల్ పరికరాలు

చదువుపై ఆసక్తి కలిగింది



గతంలో పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేక నాతో పాటు చాలామంది ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాఠశాలలను అభివృద్ధి చేశారు. ఇందులోభాగంగా మా పాఠశాల కూడా ఎంతో అభివృద్ధి చెందింది. ప్రైవేట్ పాఠశాల కంటే మా పాఠశాల వాతావరణమే అహ్లాదకరంగా మారడంతో చదువపై ఆసక్తి పెరిగింది.

– సువ్వాడ వరుణ్ తేజ, ఎనిమిదో తరగతి విద్యార్థి, సారిక ప్రాథమికోన్నత పాఠశాల

పాఠశాలకు ధైర్యంగా పంపిస్తున్నాం



గతంలో పాఠశాలలో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు లేక మా పిల్లలు ఇబ్బందులు పడేవారు. ఆడపిల్లలు మరింత ఇబ్బందులకు గురవ్వడంతో చాలా బాధేసింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మా ఊరి పాఠశాల అభివృద్ధికి నిధులు ఇవ్వడంతో ఇప్పుడు ఎంతో బాగుంది. పిల్లలు రోజూ బడికి వెలుతున్నారు. ఇంటి కంటే పాఠశాలే బాగుందంటున్నారు. విద్యకు ముఖ్యమంత్రి ఇస్తున్న ప్రాధాన్యంతో మా పిల్లల భవిష్యత్‌పై బెంగతీరింది.

– రేవళ్ల పూజిత, 8వ తరగతి విద్యార్థిని తల్లి, సారిక గ్రామం

టీడీపీ పదవులకు రాజీనామా చేస్తాం..

- పార్టీ భోగాపురం మండలాధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పూసపాటిరేగ (భోగాపురం): నెల్లిమర్ల నియోజకవర్గానికి టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థిగా లోకం మాధవిని ప్రకటించడాన్ని టీడీపీ నాయకులు ఖండించారు. ఈ మేరకు పార్టీ పదవులకు సైతం రాజీనామా చేస్తామని టీడీపీ భోగాపురం మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ అన్నారు. భోగాపురం మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 95 శాతం ఓట్లున్న టీడీపీకి టికెట్ కేటాయించకుండా.. 5 శాతం ఓట్లున్న జనసేనకు టికెట్ కేటాయించడంతో ఎన్నికల్లో సహకరించమని స్పష్టం చేశారు. టీడీపీ అధిష్టానం నిర్ణయాన్ని మార్చుకుని బంగార్రాజుకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు భోగాపురం మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లోకం మాధవిని మార్చాలి...

పూసపాటిరేగ: నెల్లిమర్ల అభ్యర్థిగా ప్రకటించిన లోకం మాధవిని మార్చకపోతే టీడీపీ పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని టీడీపీ నెల్లిమర్ల మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ అన్నారు. నెల్లిమర్లలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో టీడీపీ గెలుపు ఖాయమన్న తరుణంలో.. జనసేనకు టికెట్ ఎలా కేటాయిస్తారని అసహనం వ్యక్తం చేశారు. టీడీపీ ఇచ్ఛాపురం పరిశీలకుడు రవిశేఖర్ మాట్లాడుతూ.. జనసేన అభ్యర్థికి టికెట్ ఇవ్వడంపై పునరాలోచించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గేదెల రాజారావు, బైరెడ్డి లీలావతి, అవనాపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సేవా సంస్థలతో సమాజ మనుగడ



శాంతిరథం వద్ద రోటరీ, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

- రోటరీ గవర్నర్ డాక్టర్ మళ్ల వెంకటేశ్వరరావు

విజయనగరం: స్వచ్ఛంద సేవా సంస్థలు సమాజ మనుగడకి మూల స్తంభాలని రోటరీ గవర్నర్ డాక్టర్ మళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ విజయనగరం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర విస్తరణ అభివృద్ధి కమిటీ చైర్మన్ సాగిరాజు జానకిరామరాజుతో కలిసి శాంతిరథం, ఫ్రీజర్ బాక్స్‌లను సమాజానికి అంకితం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రోటరీ, మానవత స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా శాంతిరథం, ఫ్రీజర్‌లను వినియోగిస్తామన్నారు. జానకిరామరాజు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 112వ శాఖగా మానవత స్వచ్ఛంద సంస్థ విజయనగరం బ్రాంచ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పేదవారికి ఉపయోగపడేలా శాంతిరథం, ఫ్రీజర్ బాక్సులను వినియోగిస్తామని తెలిపారు. అంతే కాకుండా పేదలకు విద్య, వైద్యపరంగా సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సూర్యలక్ష్మి, రాధికారాణి, చైర్మన్ కేఆర్‌కే రాజు, కన్వీనర్ త్యాడ ప్రసాద్ పట్నాయక్, సాగి శివాజీరాజు, రెయ్యి శంకర్‌రెడ్డి, బోని అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నాట్యకళ.. భారతీయ సంస్కృతికి ఆలంబన



రాధికారాణిని సత్కరిస్తున్న విజయభావన సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: మన భారతీయ సంస్కృతికి రెండు వేల ఏళ్ల నుంచి నాట్యకళ ఆలంబనగా ఉందని నృత్యభూషణ డాక్టర్ భేరి రాధికారాణి అన్నారు. విజయభావన సాహితీమిత్ర సమాఖ్య 531వ సాహిత్య సభ 'వందే సాత్వికం శివమ్' పేరుతో ఆదివారం సాయంత్రం స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తగా హాజరైన ఆమె 'నృత్యం – నాడు – నేడు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రస్తుతం తొమ్మిది నాట్యరీతులను ప్రభుత్వం శాస్త్రీయ నృత్యాలుగా పేర్కొందన్నారు. అవి దేశం నలుమూలలా విస్తరించి ఉన్నాయన్నారు. నాట్యంలో ప్రధానమైన చతుర్విధ అభినయాలు నిత్యజీవితంలో కూడా ఎంతో ఉపయోగపకరమని తెలిపారు. చిన్నారులకు ఇతిహాసాలు, పురాణాలు తెలిసేందుకు నాట్యం ఒక చక్కని ప్రణాళికని వివరించారు. అనంతరం రాధికారాణిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాల ప్రిన్సిపాల్ కేవీఎల్‌ఎన్.శాస్త్రి, డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, శిరీషా రఘురామ్, భోగరాజు బాబూజీ, వారణాసి మూర్తి, నీలాద్రి, హరిప్రియ, అనురాధ, దామరాజు శంకరం, మంత్రిప్రగడ దుర్గాప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

మహాగర్జన విజయవంతం చేయండి

విజయనగరం ఫూల్‌బాగ్: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ జిల్లా చైర్మన్ బి.కాంతారావు, కేజీబీవీ టీచర్స్ రాష్ట్ర కన్వీనర్ పి. తేజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ విధానాలపై స్పష్టమైన రాజకీయ వైఖరి ప్రకటించాలని పేర్కొన్నారు. రెగ్యులర్, సమాన పనికి – సమాన వేతనం, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ, పెన్షన్‌పై అనుకూల ప్రకటనలు చేయాలని కోరుతూ వచ్చే నెల 3న విశాఖపట్నంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహ వద్ద ఉదయం పది గంటలకు మహాగర్జన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

చోడిపల్లిపేటలో అగ్ని ప్రమాదం

- రూ. 5 లక్షల ఆస్తినష్టం

పూసపాటిరేగ (భోగాపురం): భోగాపురం మండలం చోడిపల్లిపేటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మేడ గరగమ్మ, మేడ పైడమ్మలకు చెందిన పూరిళ్లు కాలిపోయాయి. ఈ సంఘటనలో మూడు లక్షల రూపాయల నగదు, రెండు తులాల బంగారం అగ్నికి ఆహుతైనట్లు బాధితులు తెలిపారు. సుమారు ఐదు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

ప్రజారంజక పాలన అందిస్తున్నాం..



రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం రూరల్: ఎన్నికల ముందు ప్రజలకు ఏమైతే హామీలు ఇచ్చారో వాటిని చిత్తశుద్ధితో అమలు చేసిన నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కొనియాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అయ్యన్నపేట పాల్‌నగర్ వరకు వీఎంఆర్‌డీఏ నిధులు రూ. 3.22 కోట్లతో నిర్మించిన 80 అడుగుల వెడల్పు రోడ్డు, రూ. 60 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణ, సుందరీకరణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేయాలనే తపనతో పని చేస్తేనే నాయకుడవుతాడన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసి పట్టణ రూపురేఖలు మార్చిన ఘనత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి దక్కుతుందన్నారు. వచ్చే ఆరు నెలల్లో పట్టణ ప్రజలకు రెండు పూటలా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాడు – నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. జిల్లాకు చెందిన ప్రతిపక్ష నాయకులు ఎన్నో ఉన్నత పదవులు అనుభవించినా జిల్లాకు చేసిన మేలు ఏమీ లేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందుగా 37వ డివిజన్‌లో రూ. 80 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంకును ప్రారంభించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు.



ఏపీజె అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణలో మంత్రి బొత్స

ప్రజా సేవే పరమావధి: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజా సేవే పరమావధిగా, వారి సమస్యల పరిష్కారానికి ఐదేళ్లుగా కృషి చేశామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలో పార్కులు, రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. అలాగే 1800 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని, ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు సురేష్‌బాబు, మేయర్ విజయలక్ష్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కమిషనర్ మల్లయ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు త్రినాథ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

- ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయలకు ప్రభుత్వ ఇవ్వాల్సిన వివిధ రకాల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా కమిటీ నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించి వర్తింపజేయాలని కోరారు. ఈ నెల 27న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని సభ్యులు విజయవంతం చేయాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ఆర్.కృష్ణ, జిల్లా అదనపు కార్యదర్శి ఏవీ శ్రీనివాసరావు, విజయనగరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ పైడితల్లి, ఎం.రామారావు, మహిళా కన్వీనర్ ఎస్.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.